# ఎరుపు !

అవి భారతదేశాన్ని కంపెనీ వాళ్ళు పరిపాలిస్తున్న రోజులు; మశూచికాది వ్యాధులకు భారతీయ వైద్యులు ఇస్తున్న సూది మందు విధానం అర్థం కాక, కంపెనీ వాళ్ళు, ఆ విధానాన్ని బహిష్కరించిన రోజులు, ఉన్న వైద్యం బహిష్కరింపబడి కంపెనీ వాళ్ళు చేసే సరైన వైద్యం లేక దేశం అల్లాడుతున్న రోజులు, చివరికి మిగిలిన వేపమండలతోనే ప్రజలు అవస్థపడుతున్న రోజులు; అకాల మరణాలకు తట్టుకోలేక జనం అంతా గ్రామ దేవతలను కొలుస్తున్న రోజులు.

అలాంటి రోజుల్లో ఒక రోజున, చందన గ్రామంలో కూడా మశూచీకం, ఆటలమ్మ సోకినాయి. ఒక్కొక్క యింట్లో ఐదారేసి మంచాలు, పిల్లల ఏడుపులు, పెద్దల ఏడుపులు మశూచికం పెద్దమ్మవారు, ఆటలమ్మ, పొంగులు లాటివి చిన్నమ్మవారు అయినాయి. ఊరంతా పొలిమేరలో వున్న గంగానమ్మ గుడికి వెళ్ళారు.

కోడినిస్తామని ఒకరు, మేకనిస్తామని ఒకరు, గొర్రెనిస్తామని ఒకరు, దున్ననిస్తామని ఒకరు ఇలా రకరకాలుగా మొక్కుకున్నారు. కొందరు ఇళ్ళల్లోనే చద్ది నైవేద్యాలు మొక్కుకున్నారు.

ఆయుర్దాయం వున్నవాళ్ళకు తగ్గుతోంది. లేనివాళ్ళు వెళ్ళిపోతున్నారు. గంగానమ్మ గుడి దగ్గర గణాచారి ఊగిపోతూ, 'ఎఱుపు, ఎఱుపు' అని అరుస్తున్నాడు. కోళ్ళు, మేకలు, గొర్రెలు, దున్నలు ఎగిరిపోతున్నాయి. రక్తం మడుగులు కట్టసాగింది. అమ్మవారి ప్రాణానికి ఏదో ఒక ప్రాణి కావాలా? మనుష్యులైతేనేమి? జంతువులైతేనేమి? ఏదో ఒక ప్రాణి హరీమంటే గాని, మహామ్మారి శాంతించదా?..ఏమో? ఎవడికి తెలుసు?..

పూర్ణ ప్రజ్ఞావధానిగారు గొప్ప శ్రీవిద్యోపాసకుడు, వేదవేదాంగవేత్త, భాష్యాంత వైయ్యాకరణి, షడ్దర్శనాచార్యుడు, "ఆయనకి అమ్మవారు పిలిస్తే పలుకుతుంది" అనేది చందన గ్రామం చుట్టుపట్ల నానుడి.

ఆయన కొక్కడే కొడుకు. హఠాత్తుగా వాడికి కూడా పెద్దమ్మవారు పొడసూపింది. తెలిసిన వైద్యం చేయిస్తున్నాడు. అవధాన్లుగారు. ఇంట్లో అందరికీ గాభరాగా వుంది. ఒకరోజు రాత్రివేళ పిల్లవాడికి చాలా తీవ్రమయింది. ఎవ్వరికీ నిద్రలు లేవు. మనస్సు పరిపరివిధాల పోయిన అవధాన్లు గారు ఏమీ తోచక, అలా కాలువగట్టు వెంబడి నడవసాగాడు. నడుస్తూ గంగానమ్మ గుడి దగ్గరకి వచ్చేటప్పటికి, కాళ్ళు పీకి, నడవలేక అరుగుమీద కూలబడ్డాడు. ఆ ప్రదేశం అంతా రక్తసిక్తమై వుంది. అవధాన్లు గారికి భరించరాని జుగుప్స కలిగింది. గంగానమ్మ కేసి చూశాడు. పాదాలదగ్గర ఉన్న దీపారాధన వెలుతురు ముఖం మీదపడి, అమ్మవారి మూర్తి భయంకరంగా కనబడింది. "శ్రీమాతా, శ్రీ మహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనేశ్వరీ, చిదగ్నికుండ సంభూతా, దేవకార్య సముద్యతా" అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు అవధాని గారు. ఒక్కక్షణం ఏదో మగతలాంటిది ఆవరించింది. ఆ మగతలో గంగానమ్మ కనబడింది. "ఏమయ్యా పండితుడా! నువ్వా నాదగ్గరికే వచ్చావా?" అని అడిగింది.

"తల్లీ! నువు దేవతవి. నేను మానవుడిని. నీ దగ్గరికి లాక్కొచ్చావు నన్ను!" అన్నాడు.

"ఐతే నీ కొడుక్కి తగ్గితే నాకు ఎఱుపు యిస్తావా?" అనడిగింది గంగానమ్మ.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు అవధానిగారు. గంగానమ్మ విగ్రహం యింకా అదే ప్రశ్న అడుగుతున్నట్టు వుంది. అవధానిగారికి కళ్ళు తిరిగినట్టయి, ఏమీ తోచక, "సరేలే! చూద్దాం" అని నీరసంగా యింటి దారి పట్టాడు.

మర్నాటికి తగ్గుముఖం పట్టింది పిల్లవాడికి, వారం తిరిగేటప్పటికి పిల్లవాడు లేచి, స్నానం చేసి ఆడుకోసాగాడు. ఇంట్లో సోమిదేవమ్మగారు చద్ది నైవేద్యం పెట్టింది.

జపంలో కూర్చోబోతున్న అవధాని గారికి కళ్ళకెదురుగా గంగానమ్మ కనబడింది. "సరే చూద్దాం అన్న పండితుడివి, నా ఎఱుపు సంగతి ఏం చేశావ్? మర్చిపోయావా?" అని తీవ్రంగా అడిగింది. నిశ్చలంగా ఆవిడకేసి చూశాడు అవధాని గారు. గంగానమ్మ అదృశ్యమైపోయింది.

వెంటనే లేచాడు అవధాని గారు. సంచీ తీసుకుని బయలుదేరాడు. గంగానమ్మ గుడి దగ్గరికి వెళ్ళాడు. "తల్లీ! నీకు ఎఱుపు కావాలి గదా!" అని అడిగాడు. అవునన్నట్టుగా చూసింది గంగానమ్మ.

సంచీలో చెయ్యి పెట్టాడు అవధాని గారు.

"తల్లీ! యదన్నావై మానవాః తదన్నావై దేవతాః యద్భాషావై మానవాః తద్భాషావై దేవతాః

"అంటే మనిషి ఆహారమేమిటో, వారి దేవతల ఆహారమూ అదే! వాడి భాష ఏదో వాడి దేవతల భాషా అదే అని కదా! ఇంతవరకూ నీకు కానుక లిచ్చుకున్నవాళు ్ళ, వాళ్ళకి అలవాటయినవి వాళ్ళు యిచ్చారు. అలాగే నాకు అలవాటయినది. నేను యిస్తున్నాను. ఎఱుపు కావాలన్నావ్ గదా! ఇదీ ఎఱుపే! తీసుకో" అని

ఎఱ్రచీర, రవికలగుడ్డ, ఎఱ్రని గాజులు, కుంకుమ, మందారపువ్వులు అమ్మవారి పాదాలముందు వుంచాడు. గంగానమ్మ తల్లి నవ్వుతూ వుండిపోయింది.